క్లుప్తంగా

ఉచిత ఎంసెట్ కోచింగ్ ప్రారంభం


మాట్లాడుతున్న త్రీటౌన్ సీఐ శ్రీరామ్

ఆదోని రూరల్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలోని విశ్వనారాయణ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత ఎంసెట్ కోచింగ్‌ని త్రీ టౌన్ సీఐ శ్రీరామ్ బుధవారం ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ.. ఎంసెట్ కోచింగ్‌కు వేలకు వేలు ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఉచిత కోచింగ్ అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్రీటౌన్ ఎస్ఐ పీరయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, డీవైఎఫ్ఐ మాజీ నాయకుడు లక్ష్మన్న, నాయకులు భరత్‌కుమార్,గౌస్,నాగరాజు, శశి, పవన్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ఆదోని టౌన్: పట్టణంలోని కిలిచినపేటలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో బుజ్జమ్మ కుటుంబం తిండి గింజలు, బట్టలు, నగదు కాలిపోయి వీధినపడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు కౌన్సిలర్ దుర్గప్ప, నాయకులు బాధితులను పరామర్శించి రూ.5 వేల నగదు, నిత్యావసర సరుకులు, బట్టలు అందజేశారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


బైజూస్ ట్యాబ్‌లను పరిశీలిస్తున్న వేణుగోపాల్

కోసిగి: పదో తరగతి వార్షిక పరీక్షలు కష్టపడి చదివి బాగా రాసి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్రశిక్ష అభియాన్ జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ సూచించారు. బుధవారం స్థానిక కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను కలిసి పరీక్ష విధానం, జవాబులు ఎలా రాశారని అడిగి తెలుసుకున్నారు. అలాగే 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించి బైజూస్ ట్యాబ్‌లను పరిశీలించారు. అందులో కంటెంట్‌ను బాగా స్టడీ చేయాలని విద్యార్థినులకు సూచించారు . అలాగే ప్రభుత్వం అందించిన ఆండ్రాయిడ్ టీవీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాడు–నేడు పనులను వేగంగా చేసేలా చూడాలని ప్రిన్సిపాల్ పుష్పలతను ఆదేశించారు. చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సునిత, సీఆర్పీ అనంతరామ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ గోపాల్‌రెడ్డి

ఆదోని రూరల్ : మండలంలోని నాగలాపురం గ్రామానికి చెందిన చిన్న ఉచ్చీరప్పపై అదే గ్రామానికి చెందిన పరమేష్, వీరేష్, ఆంజనేయ దాడి చేశారు. తాలూకా ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. చిన్న ఉచ్చీరప్ప గ్రామంలోని మహ్మద్ చికెన్‌షాపు వద్దకు చికెన్ కోసం వెళ్తుండగా పాత కక్షలను మనస్సులో పెట్టుకొని పరమేష్, వీరేష్ దాడికి పాల్పడ్డారు. దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన చిన్న ఉచ్చీరప్ప భార్య ఉరుకుందమ్మను కూడా దుర్భాషలాడుతూ దాడి చేశారు. ఈ మేరకు కోట ఆంజనేయ, కోట పరమేష్, వీరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఘనంగా ఖాసీంసాబు ఉరుసు


ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రం శివారులో వెలసిన ఖాసీంసాబు 51వ ఉరుసు బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి 12గంటల నుంచి తెల్లవారుజాము వరకు గంధం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని జంగ్లి నబిసాబు ఇంటి నుంచి ఊరేగింపుగా గంధం దర్గాకు చేరిన తర్వాత ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. నిర్వాహకులు గంధం ఎక్కించగా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం నుంచి ప్రత్యేక ఖవ్వాలి పోటీలు ఏర్పాటు చేశారు.

కూలీలకు భరోసా..ఉపాధి

- పెరిగిన 'ఉపాధి' వేతనం
- ఈ నెల నుంచి కూలీలకు రూ.272 చెల్లింపు


సాంబగల్లు వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఆదోని రూరల్: వలసల నివారణే ధ్యేయంగా ప్రారంభించిన ఉపాధి హామీ పథకం వరంగా మారింది. ముఖ్యంగా వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఈ ప్రాంతం నుంచి గతంలో వలసలు అధికంగా ఉండేవి. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం పనుల దినాల సంఖ్య పెంచడమే కాకుండా అడిగిన వారందరికీ పనులు కల్పించడం, జాబ్ కార్డులు మంజూరు చేయడంతో ప్రస్తుతం పుష్కలంగా పనులు లభిస్తున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం కూలీలకు ఇచ్చే వేతనాన్ని పెంచుతున్నట్లు ప్రకటించింది. ఆ పెంచిన కూలి ఈ నెల నుంచి అమలులోకి వస్తుందని పేర్కొంది. మొన్నటి వరకు కూలీలకు గరిష్ఠంగా రూ.257 వేతనలం లభించేది. ఇటీవల రూ.15 పెంచడంతో ఆ మొత్తం రూ.272కి చేరింది. ఈనెలలో పనిచేసిన కూలీలకు పెంచిన మొత్తం రూ.272 అందుకోనున్నారు.

కూలీలకు లబ్ధి..

జిల్లాలోని అతి పెద్ద మండలమైన ఆదోనిలో మొత్తం జాబ్‌కార్డులు 18,930 ఉన్నాయి. మొత్తం కూలీలు 33,312 మంది కాగా, ప్రస్తుతం జాబ్‌కార్డులు ఉపయోగించుకునే వారి సంఖ్య 15,945గా ఉంది. ఇందుకు గానూ 29,647 మంది ఉపాధి హామీ పనులను ఉపయోగించుకున్నారు. ఇందులో ఆర్థిక సంవత్సరం మార్చి ముగింపులో భాగంగా చాలా మందికి జాబ్‌కార్డుల గడువు ముగిసింది. ప్రస్తుతం మండలంలో 5,200 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. ఈ నెల నుంచి జాబ్‌కార్డులను ఉపాధి కూలీలు రెన్యూవల్ చేసుకోవాలి.

పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలి. పెంచిన వేతనం ఈ నెలలో కూలీలకు అందనుంది. దీంతో ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.272 దాకా అందనుంది. వారం వారం చేసిన పనులకు వేతనాలను సక్రమంగా కూలీల ఖాతాల్లో జమ చేస్తున్నాం. పని ప్రదేశాల్లో టెంట్లు, నీటి సౌకర్యం, వైద్య కిట్లు అందజేస్తున్నాం.

– గీతావాణి, ఆదోని ఎంపీడీఓ

వేతనం పెంచడం సంతోషం



మా ఇంటిల్లిపాది ఉపాధి పనుల్లో పాల్గొంటున్నాం. వారం వారం డబ్బులు తమ ఖాతాల్లో జమ అవుతున్నాయి. గతంలో కన్నా ఆర్థిక ఇబ్బందులు తొలిగాయి. ఉపాధి పనుల్లో తమకు రూ.15 అదనంగా వేతనం పెంచడం సంతోషం.

– సరస్వతి, ఉపాధి కూలీ, సాంబగల్ గ్రామం

వలస వెళ్దాం అనుకున్నాం



ఊళ్లో పనులు లేవని వలస వెళ్దామనుకున్న సమయంలో ఉపాధి పనులు కల్పిస్తాం. ఎవరూ వలస వెళ్లొద్దని అధికారులు గ్రామంలో సభ ఏర్పాటు చేసి చెప్పారు. వారి మాట విని ఉండిపోయాం. రెండు మూడు రోజుల్లోనే పనులు కల్పించారు. ప్రస్తుతం రోజూ పనుల్లో పాల్గొంటున్నాం. మేం రోజుకు రూ.257 వేతనం పొందుతున్నాం. ఈ నెలలో మరో రూ.15 పెరిగిందని సారోళ్లు చెప్పారు.

– వడ్డే శ్రీరాములు, ఉపాధి కూలీ, సాదాపురం

నేడు శ్రీరామలింగేశ్వర స్వామి రథోత్సవం


తుంగభద్ర నది ఒడ్డున వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం

కోసిగి: మండలంని కందుకూరు గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన శ్రీ రామాలింగేశ్వర స్వామి మహా రథోత్సవం గురువారం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. హంపయ్య పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా స్వామి వారికి సంప్రదాయబద్ధంగా తుంగభద్ర నదీ జలాలతో అభిషేకం, పంచామృతాబిషేకం, రుద్రాభిషేకం, వెండి కవచ అలంకరణలు గావించి మహా మంగళ హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని మహారథంపై అధిష్ఠింపజేసి ఊరేగిస్తామన్నారు. మండలంలో వివిధ గ్రామాల నుంచే కాక కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల భక్తులు తరలి రానున్నారు.

కమనీయం.. వీరభద్రేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం అనంతరం ప్రత్యేక అలంకరణలో కోట వీరభద్రేశ్వరస్వామి, కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఆదోనిఅర్బన్ : పట్టణశివారులోని శ్రీ కోట భద్రకాళి, వీరభద్రేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ అధ్యక్షుడు దేవిశెట్టి మంజునాథ్ ఆధ్వర్యంలో బుధవారం వేద పండితులు సంప్రదాయబద్ధంగా భద్రకాళి వీరభద్రేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆశీనులు గావించి బాజాభజంత్రీలు, పండితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం తంతు ముగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం రథోత్సవం, శుక్రవారం వసంతోత్సవ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

గుంటూరుకు వెళ్లి పింఛన్ అందజేత


గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో బోడెమ్మ బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ మల్లయ్య


కర్నూల్ ఆసుపత్రిలో పద్మావతి నుంచి వేలిముద్ర వేయిస్తున్న వలంటీర్ గోవర్ధన్

కౌతాళం:మండల కేంద్రానికి చెందిన వలంటీర్ మల్లయ్య గుంటూరు జిల్లా సత్తెనపల్లికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశాడు. గ్రామానికి చెందిన కూడ్లూరు బోడమ్మ అనే వితంతువు మిరప పొలాల్లో పనుల నిమిత్తం వలస వెళ్లింది. ఆమెతో పాటు ఒంటరి మహిళ అయిన లింగమ్మ కూడా వెళ్లడంతో కౌతాళం సచివాలయం–2లోని వలంటీర్ సంకబేరి మల్ల య్య సొంత ఖర్చులతో అక్కడికి వెళ్లి బుధవారం పింఛన్లు అందజేశాడు. అలాగే.. కౌతాళంలోని 3వ వార్డుకు చెందిన పిరుమల పద్మావతి కర్నూల్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని తెలుసుకొని వార్డు వలంటీర్ గోవర్ధన్ ఆసుపత్రికి వెళ్లి బుధవారం పింఛన్ మొత్తం అందజేశాడు.

నష్ట పరిహారం పంపిణీ

ఆస్పరి: మండలంలోని బైలుపత్తికొండకు చెందిన రైతు దుగ్గెన్నకు బుధవారం ఆదోనిలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు రూ.9 వేల నష్టపరిహారం చెక్కును అందజేసినట్లు ఫారెస్టు బీట్ అధికారిణి అనురాధ తెలిపారు. వివరాలు.. పది రోజుల క్రితం మండలంలోని బైలుపత్తికొండ కొండల్లో రైతు దుగ్గెన్నకు చెందిన మేక చిరుత పులి దాడిలో మరణించింది. పోస్టుమార్టం నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపగా దుగ్గెన్నకు రూ.9 వేలు నష్టపరిహారం మంజూరైంది. ఈ మేరకు బుధవారం దుగ్గెన్నకు చెక్కు అందజేశారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్



జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మాట్లాడుతున్న పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా

ఆదోని టౌన్ : బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబుజగ్జీవన్‌రామ్ అని, ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా అన్నారు. బుధవారం బాబుజగ్జీవన్‌రామ్ జయంతిని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యాలయం నుంచి ప్రదర్శనగా వెళ్లి తిమ్మారెడ్డి బస్టాండ్ సర్కిల్‌లోనున్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే.. స్థానిక కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ కార్యాలయాల్లో నీలకంఠప్ప, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్, దేవేంద్రప్ప ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర బాబుజగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి జై భీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కెం జానయ్య, ఏపీ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు యేబు, కేవీపీఎస్ జిల్లా నాయకులు జయరాజు, అనిల్, ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎరుకల వీరేష్, బీఎస్పీ ప్రధాన కార్యదర్శి మాణిక్యం రాజు ఆయన సేవలను కొనియాడారు.

కోసిగి: స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. బుధవారం ముందుగా ఆయన చిత్ర పటానికి ఎంఎస్పీ జిల్లా కో కన్వీనర్ దుర్గప్ప , మంత్రాలయం తాలుకా కన్వీనర్ నా గరాజు,మండల కన్వీనర్ సామేల్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్ మండల నా యకుడు ప్రకాష్, నరసింహులు, ఈరన్న, ఉరుకుందప్ప, చంద్రప్ప, శ్రీనివాసులు, వెంకటేష్, నాగేష్ పాల్గొన్నారు.

కౌతాళం: డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీఆర్ఓలు,వీఆర్ఏలు,కార్యాలయసిబ్బంది పాల్గొన్నారు.

ఆదోని అర్బన్ : ఎస్టీయూ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు నాగరాజు, లోక్యానాయక్, రమేష్‌నాయుడు, నరసింహులు, వీరచంద్రయాదవ్, రవి, సుంకన్న, రామంజి తదితరులు పాల్గొన్నారు. అలాగే మిల్టన్ గ్రామర్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పాఠశాల సీఈఓ వెంకటేశులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదోని రూరల్ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ వలీబాషా, ఆర్ఐ జయరామిరెడ్డి, వీఆర్వోలు రాజశేఖర్‌గౌడ్, రంగమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.


మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు


కౌతాళం తహసీల్దారు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

పోతులింగేశ్వర స్వామి ఉచ్చాయం

హొళగుంద: గజ్జహళ్లిలో వెలసిన పోతులింగేశ్వర స్వామి జాతరను పురస్కరించుకుని బుధవారం ఉచ్చాయోత్సవం ఘనంగా జరిగింది. ఉచ్చాయంలోప్రతిష్ఠించిన స్వామి విగ్రహానికి పూజారులు మహామంగళారతి, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి ఉచ్చాయాన్ని లాగారు. జాతరలో భాగంగా రథోత్సవానికి ముందు రోజు ఉచ్చాయం, పల్లకి సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం సాయంత్రం రథోత్సవం జరగనుంది.

జ్యోతి ఉత్సవాలు ప్రారంభం

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున అమ్మవారికి తొగటవీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, గణపతి పూజ, మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. పూజలకు భక్తులు తరలివచ్చారు. గురువారం తెల్లవారుజామున తుంగభద్ర నదీజలాలను మంగళవాయిద్యాలు, భజనలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారిని అభిషేకిస్తారు. అనంతరం స్థానిక బీరలింగేశ్వరస్వామి దేవాలయం నుంచి జ్యోతి ఉత్సవం వైభవంగా ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.

హనుమాన్ జయంతిని ప్రశాంతంగా జరుపుకోండి


హొళగుందలో మాట్లాడుతున్న ఏఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఆదోని సబ్ కలెక్టర్

హొళగుంద: మండల కేంద్రంలో గురువారం జరిగే హనుమాన్ జయంతిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సెబ్ ఏఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సూచించారు. బుధవారం ఆయన ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఎస్పీ వినోద్‌కుమార్‌తో కలిసి హొళగుందలో పర్యటించారు. స్థానిక పెద్ద మసీదు, బస్టాండు తదితర ప్రాంతాలను పరిశీలించిన ఏఎస్పీ కిందిస్థాయి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. అలాగే మసీదులో ముస్లింలతో మాట్లాడారు. ప్రజలకు హనుమాన్ జయంతి, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. ఆలూరు సీఐ ఈశ్వరయ్య, హొళగుంద, హాలహర్వి ఎస్ఐలు అబ్దుల్ జమీర్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల జీవితాల్లో నవోదయం

- ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష
- 7,767 మంది విద్యార్థుల దరఖాస్తు


బనవాసి నవోదయ విద్యాలయం,


స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరురూరల్: గ్రామీణ ప్రాంత ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తూ ఉన్నత ప్రమాణాలతో కూడిన అధునాతన విద్యనందిస్తున్నాయి జవహర్ నవోదయ విద్యాలయాలు. 1986లో జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి భారత ప్రభుత్వం జవహర్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించింది. సామాన్య, మధ్య తరగతి వర్గాల వారికి ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్య నానాటికి దూరమవుతున్న పరిస్థితుల్లో 'నవోదయ'లో కార్పొరేట్‌కు దీటుగా విద్యనందిస్తూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నాయి. ఇక్కడ చదివిన విద్యార్థులు తదనంతర చదువుల్లో కూడ ప్రగతి సాధిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. బనవాసి జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశానికి 7,767 మంది విద్యార్థులు దరఖాస్తు చేయడాన్ని గమనిస్తే పోటీ ఏ విధంగా ఉంటుందో తెలుసుకోవచ్చు.

- నవోదయ విద్యాలయంలో సీటు వచ్చిందంటే చాలు తమ బిడ్డ భవిత బంగారమేనని తల్లిదండ్రులు భావిస్తున్నారు. అంతటి ప్రాధాన్యత సంతరించుకున్న నవోదయ విద్యాలయంలో 2021–2022 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ప్రవేశ పరీక్ష ప్రకటన విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష ఉంటుంది. బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 80 సీట్లు అందుబాటులో ఉండగా బాలికలకు 30 శాతం సీట్లు, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తారు. మొత్తం 80 సీట్లలో 75 శాతం అంటే 60 సీట్లను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 20 సీట్లు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయిస్తారు.

అత్యుత్తమ విద్యా ప్రమాణాలు

నవోదయ విద్యాలయంలో సీబీఎస్ఈ సిలబస్‌తో కూడిన విద్యను నిపుణులైన అధ్యాపకులు బోధిస్తారు. సువిశాల ప్రాంగణం, ఆహ్లాదకర వాతావరణం, ఒత్తిడి లేని విద్య, విద్యార్థి కేంద్రీకృత అత్యుత్తమ విద్యా బోధన, అధునాతన కంప్యూటర్ ల్యాబ్, పోషక విలువలతో కూడిన ఆహారం, మానసికోల్లాసానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, ఎన్‌సీసీ తదితర అంశాలు ఇక్కడి ప్రత్యేకతలు .అలాగే ఎన్‌సీసీ, నేషనల్ గ్రీన్ కోర్, స్కౌట్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు సంగీతం, నృత్యం, చిత్రలేఖనం తదితర అంశాల్లోనూ శిక్షణ అందిస్తున్నారు. సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తూ నవోదయాలు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

విశాల గ్రంథాలయం

బనవాసి నవోదయలో విద్యార్థుల సౌకర్యార్థం సైన్స్, గణితం, సాహిత్యం తదితర అంశాలకు సంబంధించిన 10,300 పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచారు. అలాగే సమకాలీన వార్తాంశాలపై అవగాహన కోసం పలు తెలుగు, ఆంగ్ల ప్రతికలను విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నారు.


అధునాతన కంప్యూటర్ ల్యాబ్

విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో విద్యాబోధన చేసేందుకు శాంసంగ్ స్మార్ట్ క్లాస్ రూం ఏర్పాటు చేశారు. 41 ల్యాప్‌ట్యాప్‌లు, 40 టాబ్లెట్లు విద్యార్థులకు అందుబాటులో ఉంచి వేగవంతమైన అంతర్జాల సౌకర్యం కల్పించారు. డిజిటల్ క్లాస్ రూమ్స్‌లో నిపుణులైన అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తున్నారు.

అంతా ఉచితమే

నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉచితమే. ఆరు నుంచి 12వ తరగతి వరకు అత్యుత్తమ విద్య అందిస్తారు. భోజనం, వసతి, యూనిఫాం, బూట్లు, పుస్తకాలను అందిస్తారు. విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆరోగ్య పర్యవేక్షణ కోసం స్టాఫ్ నర్స్ అందుబాటులో ఉంటారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

అత్యుత్తమ ప్రమాణాలతో విద్యాబోధన



విద్యాలయంలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ పటిష్ఠ విద్యా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మానసిక నిపుణలచే కౌన్సిలింగ్ ఇప్పిస్తాం. వారి ఉజ్వల భవిషత్ కోసం కేరీర్ గైడెన్స్ సెల్ ఏర్పాటు చేశాం. న్యూట్రిషియన్ ఆధ్వర్యంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నాం. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు చాలా మంది ఉన్నత స్థాయిలో ఉన్నారు.

– కె.సాగరిక, ప్రిన్సిపాల్, బనవాసి నవోదయ

పరీక్ష విధానం

నవోదయ ప్రవేశ పరీక్షలో 100 మార్కులకు 80 ప్రశ్నలు ఉంటాయి. సమయం రెండు గంటలు. దివ్యాంగులకు అదనంగా 40 నిమిషాలు సమయం ఇస్తారు.విద్యార్థులుహాల్‌టికెట్లను httpr://cbreitmr.rci.gov.in/nvr/AdminCard/AdminCard వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.